సాక్షి ప్రకాశం

బుధవారం । 27 । ఆగస్టు । 2025



మోసం చేయడం బాబు నైజం

ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని మాజీ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. నాగులుప్పలపాడు మండలంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.

- 2లో..



చౌటపాలెంలో తమ్ముళ్ల దౌర్జన్యం

పొన్నలూరు మండలం చౌటపాలెంలో వైఎస్సార్ సీపీకి చెందిన ఇద్దరు మహిళల పొలంలో సాగు చేసిన జామాయిల్ మొక్కలను టీడీపీ వర్గీయులు కక్షసాధింపులో భాగంగా ట్రాక్టర్‌తో దున్నేశారు.

- 2లో..


గరిష్టం/కనిష్టం

33 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

పర్యావరణ హితాయ..
మట్టి గణపతికి జై...



విఘ్నేశ్వరుని ఆవాహనకు దివ్య ఘడియలు సమీపించాయి. వేదోక్త మంత్రోచ్చారణలతో ఆధ్యాత్మికత నిండి భూలోకమంతటా పవిత్రత విరాజిల్లుతోంది. గణపతి బప్పా మోరియా నినాదాలతో ప్రతి గృహం, వీధులన్నీ శోభాయమానంగా మారాయి. బుధవారం వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఉత్సవాల సంబరాలు, భక్తి వాతావరణం అలుముకుంది. 'మహా గణపతిం మనసా స్మరామి' అనే మంగళనినాదంతో ఒంగోలు నగరం అంతా మార్మోగుతోంది. నగరంలో ప్రతిష్ఠించనున్న మహాగణపతి విభిన్నరూపాలు భక్తహృదయాలను పరవశింపచేయనున్నాయి. జిల్లాలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల కంటే పర్యావరణ పరిరక్షణకు మట్టివిగ్రహాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు.

- సాక్షి, ఒంగోలు

న్యూస్‌రీల్

28న ప్రతిజ్ఞా దినం పాటించండి

- విద్యుత్ వీరులను స్మరిస్తూ మరో పోరాటానికి సిద్ధం కావాలి
- వామపక్ష పార్టీల పిలుపు

ఒంగోలు టౌన్: ఈ నెల 28న జిల్లా వ్యాప్తంగా ప్రతిజ్ఞా దినం పాటించాలని, వామపక్ష పార్టీలు మంగళవారం ఒక ప్రకటనలో కోరాయి. 2000 ఆగస్టు 28న హైదరాబాద్ బషీరాబాగ్‌లో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన మహా ఉద్యమంలో పోలీసులు కాల్పుల్లో రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి వంటి అమర వీరులు ప్రాణాలు అర్పించారన్నారు. వారి త్యాగం విద్యుత్ రంగ ప్రైవేటీకరణను కొంతకాలం ఆపగలిగిందన్నారు. ఈ నెల 28న ప్రతిజ్ఞా దినంగా జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్), సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీలు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కార్యదర్శులు ఎస్ కే మాబు, ఎంఎల్ నారాయణ, డీవీఎన్ స్వామి, సీహెచ్ సాగర్, నాయకులు కె లలిత కుమారి తెలిపారు. నాటి ఉద్యమ ప్రభావం రెండు దశాబ్దాల పాటు విద్యుత్ జోలికి వెళ్లలేని పాలకులు ప్రస్తుత కూటమి ప్రభుత్వం మరోసారి విద్యుత్ సంస్కరణలను అమలు చేసే తరుణంలో, రైతులు-వినియోగదారులు మరింత భారం భరించాల్సిన పరిస్థితి తలెత్తుతుందని వామపక్ష పార్టీలు హెచ్చరించాయి. విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ కార్పొరేట్ దోపిడీకి వదిలేయకుండా ప్రజల హక్కులను కాపాడే దిశగా పోరాటాలకు సిద్ధం కావాలని, అమరుల స్ఫూర్తితో విద్యుత్ రంగాన్ని కాపాడేందుకు ఏకమవ్వాలని నాయకులు పిలుపునిచ్చారు.

పచ్చనేతల అరాచకాలకు ఖాకీ దమనకాండ తోడవడంతో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. జిల్లాలో పోలీసులు నిస్సిగ్గుగా ఖాకీ దుస్తులు వదిలేసి పచ్చనేతల్లా జనంపై రెచ్చిపోతూ దాడులకు తెగబడుతున్నారు. లాఠీలతో దౌర్జన్యకాండకు దిగుతున్నారు. మహిళలు అని చూడకుండా దాడులు చేస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. సివిల్ కేసులను తమ చేతుల్లోకి తీసుకుని రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. మంగళవారం తెల్లవారుజాము ముండ్లమూరులో వైఎస్సార్ సీపీ నేత దుకాణాన్ని కూల్చేశారు. కోర్టులో వివాదం ఉన్నప్పటికీ రాత్రి పూట కొండపి మండలం జాళ్లపాలెంలో పోలీసులు రచ్చబండను కూల్చేందుకు యత్నించి అడ్డుకున్న వారిపై లాఠీలతో ప్రతాపం చూపించారు. పలువురు మహిళలకు గాయాలయ్యాయి.



పసుపుగల్లులో గ్రామస్తులపై లాఠీచార్జ్ చేస్తున్న సీఐ రామారావు

చట్టం చుట్టమై..
ఖాకీ అరాచకమై..

- పచ్చనేతల కనుసన్నల్లో ఖాకీల అరాచకాలు
- ఉదయం పసుపుగల్లులో వైఎస్సార్‌సీపీ నేత దుకాణం కూల్చివేత
- కోర్టులో ఉన్నా రాత్రి కొండపిలో రచ్చబండ కూల్చివేత
- ఇదేమిటని ప్రశ్నించిన వారిపై లాఠీలతో దాడి
- గన్ చూపిస్తూ కాల్చేస్తానని సీఐ బెదిరింపు
- కొండపి మండలం జాళ్లపాలెంలో పోలీసుల దాష్టీకం
- మహిళలకు తీవ్రగాయాలు
- పోలీసుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

జిల్లాలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులు
సివిల్ వివాదాల్లో తలదూరుస్తూ రాజ్యాంగ ఉల్లంఘన



ముండ్లమూరు మండలం పసుపుగల్లులో నడిరోడ్డుపై వీరంగం సృష్టిస్తున్న పోలీసులు

సాక్షి నెట్‌వర్క్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీస్‌స్టేషన్లు పచ్చనేతల అడ్డాలుగా మారిపోయాయి. శాంతి భద్రతలు పరిరక్షించాల్సిన పోలీసులు రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. తమ పరిధులు దాటి సివిల్ వివాదాల్లో తలదూరుస్తూ రెచ్చిపోతున్నారు. ఇదేమిటని అడిగితే లాఠీలకు పనిచెబుతున్నారు. బెదిరింపులకు దిగుతూ అధికార పార్టీకి బానిసలుగా మారిపోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దర్శి, కొండపి నియోజకవర్గాల్లో అయితే ఖాకీల తీరు సెపరేటుగా ఉంది. ఇక్కడ పచ్చనేతల చేతుల్లో కీలుబొమ్మలా మారి వారు చెప్పిందే వేదంగా ప్రతిపక్ష నేతలపై ప్రత్యక్ష దాడులకు దిగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నేరాల అదుపునకంటే పచ్చనేతలకు జీహుజూర్ అంటున్నారని ప్రజలు మండిపడుతున్నారు. దర్శి నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జ్ చెప్పిందే డ్యూటీగా చేస్తున్నారే తప్ప నిజమైన పోలీస్ డ్యూటీ మాత్రం చేయడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నేతలే టార్గెట్‌గా దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తూర్పు వీరాయపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మాజీ ఎంపీటీసీ ముప్పరాజు శ్రీనుకు చెందిన స్థలం పై కూటమి నేతలు కన్నేశారు. ఆక్రమించుకోవాలని చూడటంతో కోర్టును ఆశ్రయించారు. స్థానిక కోర్టులో, జిల్లా కోర్టులో కూడా ఆస్థలం ముప్పరాజు శ్రీనుకు చెందుతుందని తీర్పు వచ్చింది. గ్రామ నడిబొడ్డులో ముప్పరాజు శ్రీను ఉండడం జీర్ణించుకోలేని టీడీపీ నేతలు అక్రమాలకు తెరలేపారు. గొట్టిపాటి లక్ష్మి ఆదేశాలతో గ్రామ కార్యదర్శి జేసీబీతో వెళ్లి సుమారు రూ.20 లక్షలతో నిర్మించుకున్న ఇంటిని ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేశారు. తూర్పు వీరాయపాలెం సర్వేనంబరు 133/5 లోని 2 సెంట్ల స్థలాన్ని 2010 లో ముప్పరాజు లక్ష్మి వద్ద కొనుగోలు చేసి రిజిస్టరు చేయించుకున్నారు. అప్పుడు కూడా ఇదే పోలీసులు పచ్చ రౌడీల్లా వ్యవహరించి వైఎస్సార్‌సీపీ నేతలను భయభ్రాంతులకు గురి చేశారు. ఎవరైనా అడ్డువస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ సంఘటన మరువక ముందే పసుపుగల్లు గ్రామంలో ముండ్లమూరు మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి స్థలంలో ఉన్న దుకాణాలను తొలగించారు. తూర్పు వీరాయపాలెం గ్రామంలో తొలగిస్తే ఏం చేయలేదు ఇక్కడ మాత్రం ఏం చేస్తారులే అనుకున్నారు. ఖాకీల ప్రతాపాన్ని చూపించారు. పసుపుగల్లు గ్రామంలో రిజిస్ట్రేషన్ స్థలం రోడ్డుకు అడ్డుగా లేదు. 25 సంవత్సరాల నుంచి ఆ స్థలంలో శ్రీనివాసరెడ్డి కుటుంబీకులు చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. మండల కన్వీనర్‌గా ఉన్న శ్రీనివాసరెడ్డికి చెందిన స్థలాన్ని మంగళవారం ఉదయం గం.5.30 కు పొక్లెయిన్ తీసుకుని వెళ్లి పడగొట్టేందుకు ప్రయత్నించారు. దీంతో కుటుంబ సభ్యుల అడ్డుకుని తమకున్న పత్రాలు చూపించారు. దీంతో రంగంలోకి దిగిన సీఐ రామారావు పోలీసులకే అడ్డు చెప్తారా అంటూ ఎవడ్రా ఆపింది అని రౌడీలా రెచ్చిపోయారు. మీ టైం అయిపోయింది..వెళ్లిపోండి అని గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేశారు.

అడ్డు వచ్చిన మహిళలను నానా దుర్భాషలాడారు. మహిళలపై సైతం ప్రతాపం చూపించారు. శ్రీనివాసరెడ్డి పై దాడి చేసి చొక్కాను చింపివేశారు. సీఐ లాఠీ తీసుకుని స్థానికులపై లాఠీ ఝుళిపించారు. గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేశారు. గ్రామస్తులు ప్రతిఘటించి ఎదురు తిరగటంతో పోలీసులు దుకాణాలు కూల్చి వేసి అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా గొట్టిపాటి లక్ష్మి నియోజకవర్గ ఇన్‌చార్జి పదవిని అడ్డం పెట్టుకుని ఆమె ఎక్కడికి వెళితే అక్కడికి పోలీసులను తిప్పుకోవడం పలు విమర్శలకు తావిస్తోంది. డీఎస్పీ అధికారి నుంచి ఎస్సైల వరకు ఆమె ఏ మండలానికి వెళ్లినా పోలీస్ కాన్వాయ్ వెంట వెళ్లాల్సిందే.



దుకాణాలను కూలుస్తున్న జేసీబీ



కొండపి మండలం జాళ్లపాలెంలో కూల్చేసిన రచ్చబండ

స్వామి కళ్లలో ఆనందం కోసమే...



వేపచెట్టు, రచ్చబండ ఆనవాళ్లు లేకుండా జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

ఒంగోలు, టాస్క్‌ఫోర్స్: తెల్లవారితే వినాయక చవితి పండుగ. మరో పక్క గ్రామంలో ఒక మహిళ పాము కాటుతో మరణించింది. కొండపి మండలం జాళ్లపాలెంలో మంగళవారం కొందరు గ్రామస్తులు పండుగ ఏర్పాట్లలో నిమగ్నం కాగా, మహిళ చనిపోయిన బాధలో కొంత మంది ఉన్నారు. ఈ క్రమంలో కోర్టు పరిధిలో ఉన్న గ్రామంలోని రచ్చబండను పక్కా ప్రణాళికతో సీఐ సోమశేఖర్ తొలగించేందుకు పథకం రచించారు. ఆమేరకు ఎస్సై ప్రేమ్‌కుమార్ సాయంత్రం ఆరు గంటలకు గ్రామానికి వచ్చి మొదట గత నెలలో రచ్చబండ తొలగింపులో అడ్డుపడిన 10 మంది మహిళలపై కేసులు ఉన్నాయని, వారందరూ పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు. దీంతో మహిళలు గ్రామంలో పాముకాటుతో మనిషి చనిపోయింది రేపు వస్తామని చెప్పారు. అయినా మీరు రావాల్సిందేనని పట్టుబట్టడంతో జీపులో తీసుకెళ్లమని మహిళలు చెప్పడంతో మీరు జీపులో కాదు ఆటోలో రావాలని ఆదేశించారు. ఈ క్రమంలో రాత్రి 8 గంటల సమయంలో గ్రామానికి వచ్చిన సీఐ సోమశేఖర్ 10 మంది మహిళా పోలీసులతో కలిపి దాదాపు 30 మంది కానిస్టేబుల్సను గ్రామానికి రప్పించారు. దీంతో విషయం అర్థమైన గ్రామస్తులు సుమారు 100 మంది వరకు రచ్చబండ వద్దకు చేరారు. తమకు ఎన్నో సంవత్సరాలుగా నీడనిచ్చే వేపచెట్టు, కూర్చునే రచ్చబండను తొలగించవద్దని వేడుకున్నారు. కానీ పోలీసులు మాత్రం మంత్రి స్వామి కళ్లలో ఆనందం చూడాలనే ఆరాటంతో వారందరినీ అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. కానీ గ్రామస్తులు వెళ్లకపోవటంతో చివరికి పిస్తోల్ తీసి కాల్చిపారేస్తా... నాకొడల్లారా అని గురి పెట్టి బెదిరించారు. అప్పటికీ మహిళలు తగ్గకపోవటంతో లాఠీలకు పనిచెప్పారు. ఈ క్రమంలో 8 మందికి తీవ్ర గాయాలు కాగా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని పోలీసులు ఒక్కొక్కరిని ఒక్కో ఇంట్లో పెట్టి బయట తలుపేశారు. ఆ సమయంలో 108 గాయపడిన వారిని తీసుకుని వెళ్లడానికి వచ్చినా పోలీసులు ఒప్పుకోకపోవటంతో వారిని తీసుకుని వెళ్లకుండానే 108 వెళ్లిపోయింది. తరువాత పోలీసులు జేసీబీతో రచ్చబండను పూర్తిగా తొలగించి నీడనిచ్చే పచ్చని వేపచెట్టును పడగొట్టి ఎటువంటి ఆనవాలు లేకుండా ఉండేటట్లు ట్రాక్టర్లతో తొలగించారు. కేవలం ఒక్క సెంటు స్థలం కోసం అది కూడా టీడీపీ సానుభూతిపరుడిది అవునో కాదో తెలియని స్థలం కోసం మంత్రి స్వామి ఆదేశాలతో పోలీసులు ఈ విధంగా రాత్రి పూట విధ్వంసం సృష్టించటం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులను అడ్డుపెట్టుకుని దారుణాలు

- ఎస్సై, సీఐ దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి
- వైఎస్సార్ సీపీ నాయకులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి
- తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



కూల్చివేతలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: నియోజకవర్గంలో పోలీసులను అడ్డుపెట్టుకుని దారుణాలు చేస్తున్నారని, పోలీసులు శాంతి భద్రతలు పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ నాయకుల పై కేసులు పెట్టడం, దాడులు చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ముండ్లమూరు మండలం పసుపుగల్లులో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డికి చెందిన దుకాణాలను కూల్చేసిన విషయం తెలుసుకున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అక్కడకు వెళ్లి పరిశీలించారు. అక్కడ మహిళలు తమతో పోలీసులు ప్రవర్తించిన తీరును పూసగుచ్చినట్లు వివరించారు. పోలీసులు తమపై అమానుషంగా ప్రవర్తించారని, చెప్పలేని అసభ్య పదజాలంతో బూతులు తిట్టి దారుణంగా వ్యవహరించారని వాపోయారు. సంస్కారం మరచి తమతో అసభ్యంగా ప్రవర్తించిన తీరును వివరించారు. అనంతరం దర్శి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి బూచేపల్లి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం అయిందని అన్నారు. తెల్లవారుజామునే దర్శి సీఐ రామారావు, ఎస్సై మురళి, ముండ్లమూరు ఎస్సై కమలాకర్, తాళ్లూరు ఎస్సై మల్లిఖార్జున్, మరో 30 మంది పోలీసులు వచ్చి దౌర్జన్యంగా శ్రీనివాసరెడ్డి స్థలంలో ఉన్న గదులను పడగొట్టడంపై మండిపడ్డారు. పంచాయతీరాజ్‌కు సంబంధం లేని సెక్రటరీ ఇచ్చిన కంప్లైంట్ అడ్డం పెట్టుకుని కక్ష సాధింపుగా దుకాణాలు పడగొట్టారన్నారు. ఆర్‌అండ్‌బీ పరిధిలో ఆ స్థలం లేదని, చింతలపూడి వెళ్లే రోడ్డు పక్కన కాలువల వెనక్కు గదులు ఉన్నాయని, అయినా ఏ అధికారంతో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా పడగొట్టారని బూచేపల్లి ప్రశ్నించారు. ఇటీవల తూర్పువీరాయ పాలెం గ్రామంలో ముప్పరాజు శ్రీనివాసరావు భవనాన్ని పొక్లెయిన్‌లతో కూల్చి వేశారన్నారు. ఈరోజు చింతా శ్రీనివాసరెడ్డి దుకాణాలు పడగొట్టారన్నారు. అక్కడున్న మహిళలను, మండల ప్రజా ప్రతినిధిని ఈడ్చుకెళ్లి అసభ్య పదజాలంతో నానారకాల ఇబ్బందులు పెట్టారన్నారు. సంబంధం ఉన్న పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ ఫిర్యాదు చేయలేదని, సంబంధం లేని సెక్రటరీ ఫిర్యాదు చేస్తే దౌర్జన్యంగా ఎందుకు పగలగొట్టాల్సి వచ్చిందని పోలీసులను నిలదీశారు. ''టీడీపీ ఇన్‌చార్జ్ గారు.. మీరు కొత్తగా రాజకీయాల్లోకి వచ్చారు... మీకు చేతనైతే పది మందికి సాయం చేయండి. అధికారం ఉంది కదా అని పోలీస్ వ్యవస్థను వాడుకుని ఇలా చేయడం మంచి పద్ధతి కాదని'' హితవు పలికారు. పోలీసులు శాంతి భద్రతలు పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు పెట్టడం, దాడులు చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. పోలీసులు అరాచకాలు, దౌర్జన్యాలు, కక్షసాధింపులు మానుకోవాలన్నారు. మండల కన్వీనర్‌ను లాగి చొక్కా చించి దారుణంగా ప్రవర్తించారన్నారు. ఈ విషయాలను ఎస్పీ, డీజీపీల దృష్టికి తీసుకుని వెళ్లి ఇక్కడ పోలీస్‌ల తీరుపై ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

బడ్జెట్ తగ్గించుకోవాలనే పింఛన్‌లు పీకేశారు:

జిల్లాలో బడ్జెట్ తగ్గించుకోవాలనే 3780 పింఛన్‌లు తీసేశారని, నియోజకవర్గంలో 579 పింఛన్‌లు తీసేశారని చెప్పారు. ఏళ్ల తరబడి పింఛన్‌లు తీసుకుంటున్న వారిని కూడా అనర్హులుగా చేశారని, వారి ఉసురు ప్రభుత్వానికి తగులుతుందన్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారులను టార్గెట్ చేసి పింఛన్‌లు రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారందరికీ వెంటనే పింఛన్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

టీడీపీ నాయకుడిలా సీఐ దౌర్జన్యం:

ముండ్లమూరు మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2002లో భూమిని కొనుగోలు చేసి అప్పటి నుంచి అందులో రూములు వేసుకుని ఉన్నామన్నారు. సీఐ తామేమి చెప్పినా వినకుండా టీడీపీ నాయకుడిలా దౌర్జన్యం చేశారన్నారు. మీరు జీతాలు తీసుకుంటుంది ప్రభుత్వం దగ్గరా లేక టీడీపీ కార్యాలయంలోనా లేక ఇన్‌చార్జ్ దగ్గర తీసుకుంటున్నారా అని ప్రశ్నించారు. ''మీ టైం అయిపోయింది వెళ్లిపోండిరా'' అంటూ దౌర్జన్యంగా మాట్లాడిన తీరు తమను ఎంతో బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పది మందికి సాయం చేస్తే ఎవరైనా హర్షిస్తారు కానీ ఇలా కక్ష సాధింపు చర్యలు చేస్తే ప్రజాగ్రహానికి గురికావాల్సి ఉంటుందని హితవు పలికారు. విలేకరుల సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మండల కన్వీనర్‌లు వెన్నపూస వెంకటరెడ్డి, కాకర్ల కృష్ణారెడ్డి, యన్నాబత్తిన సుబ్బయ్య, జెడ్పీటీసీలు నుసుం నాగిరెడ్డి, తాతపూడి రత్నరాజు, స్టేట్ మహిళా విభాగం కార్యదర్శి మేడికొండ జయంతి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

ఒంగోలు సిటీ: ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో వినాయకచవితి పండుగను జరుపుకోవాలని, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఏవిధమైన విఘ్నాలు లేకుండా గణనాథుని కటాక్షం అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

క్లుప్తంగా

అధిక ధరలపై కన్నెర్రజేసీ




యూరియాను తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ


కొత్తపట్నం: యూరియాను అధిక ధరలకు విక్రయించడంపై జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ కన్నెర్ర చేశారు. దుకాణదారునిపై 6ఏ కేసు నమోదు చేసి యూరియా నిల్వలను సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే..కొత్తపట్నం మండలంలో ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న సమాచారంతో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకుడు బి.రమేష్‌బాబు, తహసీల్దార్ శాంతి, వ్యవసాయాధికారి జి.కిషోర్‌బాబు బృందంతో దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత కొత్తపట్నం శివాలయం వీధిలో ఉన్న షా ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. తనిఖీల్లో యూరియా రూ.266లకు విక్రయించాల్సి ఉండగా అధిక ధరకు రూ.300 విక్రయిస్తుండటంతో జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణదారునిపై 6ఏ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. దుకాణంలోని 108 యూరియా బస్తాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎరువుల బస్తాలు ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు ఫిర్యాదు చేస్తే దుకాణ యజమానులపై చట్టపర చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు ధరలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

సందెవేళ.. ప్రకృతి హేల

సూర్యాస్తమయ సమయంలో కనువిందు చేస్తున్న కంభం చెరువు



సాయం సంధ్యవేళలో కంభం చెరువు మధ్యలో పడుతున్న సూర్యకిరణాలు



సూర్యుడు అస్తమించే సమయంలో సుందర దృశ్యం

సాయంసంధ్య వేళలో అస్తమించే రవి కిరణాలు ప్రకృతి కాన్వాసుపై అద్భుత వర్ణచిత్రాలను ఆవిష్కరించాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చారిత్రాత్మక కంభం చెరువులో 7 అడుగుల మేర నీళ్లు ఉన్నాయి. సాయంత్రం 6.30 నుండి 7 గంటల మధ్యలో సూర్యాస్తమయ సమయంలో సూర్య కిరణాలు నీటి పై పడుతూ వివిధ రంగులను ఆవిష్కరించిన దృశ్యం చూపరులను కట్టిపడేసింది. సాయంత్రం పూట పలువురు సందర్శకులు చెరువు వద్దకు వెళ్ళి సరదాగ సెల్ఫీలు తీసుకుంటూ గడుపుతున్నారు. – కంభం

ఓడించామని కక్ష సాధింపు

- పోలీసులు వీధి రౌడీల్లా ప్రవర్తించారు
- మహిళలను కూడా ఈడ్చి పడేశారు
- ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లు
- వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి ధ్వజం

ముండ్లమూరు(దర్శి): అసెంబ్లీ ఎన్నికల్లో గొట్టిపాటి లక్ష్మీని ప్రజలు ఓడించడంతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి అన్నారు. పసుపుగల్లు గ్రామంలో తనకు జరిగిన అన్యాయంపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన వివరాలు వెల్లడించారు. తనకు తన సోదరి భర్త రత్నారెడ్డి పేరుపై గ్రామ ప్రధాన సెంటర్ కూడలిలో రెండు సెంట్ల స్థలం ఉందని, వ్యాపారానికి అనుకూలంగా ఉండే ఆ స్థలంలో గత 25 ఏళ్లుగా రేకుల షెడ్‌లలో దుకాణాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే మంగళవారం తెల్లవారుజామున సుమారు 50 మంది పోలీసులకు వచ్చి దౌర్జన్యానికి దిగారన్నారు. దర్శి ఎస్సై మురళీ, ముండ్లమూరు ఎస్సై కమలాకర్, తాళ్లూరు ఎస్సై మల్లికార్జున్‌లు అక్కడకు వచ్చి ఎవరికీ చెప్పకుండా రేకుల దుకాణాలను కూల్చివేసేందుకు బీభత్సం సృష్టించారని చెప్పారు. మహిళలన్న గౌరవం కూడా లేకుండా వారిపై కూడా దౌర్జన్యం చేశారన్నారు. సీఐ రామారావు ఖాకీ దుస్తులు వేసుకున్న విషయం కూడా మరిచిపోయి అడ్డొస్తే కేసులు పెడతాం అంటూ చిందులు తొక్కి మహిళలని కూడా చూడకుండా రోడ్డుపైకి లాక్కెళ్లి దౌర్జన్యాన్ని ప్రదర్శించారని ఆవేదన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న చింతా శ్రీనివాసరెడ్డి

గ్రామంలో మెజార్టీ వచ్చిందనే కూల్చివేత..

అసెంబ్లీ ఎన్నికల్లో పసుపుగల్లు గ్రామంలో 248 ఓట్లు మెజార్టీ వచ్చిందని, నాలుగు బూత్‌లలో వైఎస్సార్ సీపీకి మెజారిటీ రావడంతో సహించలేక గొట్టిపాటి లక్ష్మీ మమ్మల్ని ఇబ్బందులు పెట్టాలని కంకణం కట్టుకుందన్నారు. గొట్టిపాటి లక్ష్మీ చెప్పిందని బిజ్జం సుబ్బారెడ్డి గ్రామంలో ఈ పనిచేయిస్తున్నాడన్న విషయం గ్రామంలో అందరికీ తెలుసన్నారు. ఈ స్థలాన్ని నరసింహ స్వామి దేవస్థానానికి ఇస్తామని చెప్పామని, దేవునికి భూమి ఇస్తే గౌరవం వస్తుందని, ఆ గౌరవం దక్కకుండా ఉండాలని దౌర్జన్యంగా భూమి ఆర్‌అండ్‌బీదిగా చెప్తున్నారన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎంపీపీకి, సర్పంచులు, మెంబర్లకు తెలియకుండా సంతకాలు పెట్టి తప్పుడు తీర్మానం తయారు చేశారన్నారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఇలా చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పది మందికి సాయం చేసి పేరు తెచ్చుకోవాలని, ఇలా దౌర్జన్యాలు, పోలీసులను అడ్డుపెట్టుకొని కొంపలు కూల్చితే ప్రజలు రానున్న రోజుల్లో మరోసారి బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. ఇటీవల తూర్పు వీరాయపాలెం గ్రామంలో ముప్పరాజు శ్రీను నివాసాన్ని ఎటువంటి నోటీసులు లేకుండా పోలీసులను మొహరించి కూల్చివేశారని, మాకూ ఎటువంటి నోటీసులు లేకుండా తెల్లవారుజామునే వచ్చి దుకాణాలు కూల్చివేశారని చెప్పారు. పాలన అంటే పది మందికి సాయం చేసే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు.

రూ.2 లక్షల విలువైన విద్యుత్ కేబుల్ చోరీ

- లబోదిబోమంటున్న రైతులు



విద్యుత్ కేబుల్ కాల్చిన ఆనవాళ్లు

కురిచేడు: మండలంలోని కాటంవారిపల్లె, కురిచేడు గ్రామాల్లో సుమారు 40 మంది రైతులకు చెందిన విద్యుత్ కేబుల్ చోరీకి గురైంది. నాగార్జున సాగర్ కాలువ ఆనుకొని పంట పొలాలు ఉన్న రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు కాలువ వద్ద ఏర్పాటు చేసుకున్న మోటార్ల విద్యుత్ కేబుల్ సోమవారం రాత్రి చోరీకి గురైంది. సోమవారం సాయంత్రం వరకు పంటలకు నీరు పెట్టుకుని ఇంటికి రాగా మంగళవారం ఉదయం వెళ్లి చూసే సరికి విద్యుత్ కేబుల్ వైరు లేదని రైతులు వాపోయారు. మండలంలోని కాటంవారిపల్లె గ్రామ సమీపంలో విద్యుత్ కేబుల్ కాల్చినట్లు రైతులు గుర్తించారు. ఈ విషయమై ఎస్సై ఎం శివను వివరణ కోరగా తమకు రైతులు ఎటువంటి ఫిర్యాదు చేయలేదని తెలిపారు. అయినా కూడా సుమోటోగా తీసుకుని కాలువ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వున్నాయని, వాటిని పరిశీలిస్తామని, విద్యుత్ కేబుల్ చోరీ చేసిన వారిని పట్టుకుని శిక్షపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. గణేశ నవరాత్రులు జరుగుతున్నందున రైతులు కూడా అప్రమత్తంగా ఉండి కాలువ కట్టపై అనుమానాస్పదంగా ఎవరైనా తిరుగుతున్నట్లు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోండి

- జాతీయ రహదారిపై ట్రాక్టర్ అడ్డుపెట్టి చిన్నగుడిపాడు గ్రామస్తుల రాస్తారోకో



గ్రామస్తుల ఆందోళనతో నిలిచిన వాహనాలు

పెద్దదోర్నాల: కర్నూల్, గుంటూరు జాతీయ రహదారిపై తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని చిన్నగుడిపాడు వాసులు మంగళవారం వాహనాల రాకపోకలను అడ్డుకుని రాస్తారోకోకు దిగారు. దీంతో కర్నూల్, గుంటూరు జాతీయ రహదారిపై గంట పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిధిలోని చిన్నగుడిపాడులో సోమవారం రాత్రి ఓ వాహనం ఢీకొని బొమ్మలాపురానికి చెందిన వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ రహదారిలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో స్పీడ్ బ్రేకర్లతో పాటు డివైడర్లు ఏర్పాటు చేసి ప్రమాద తీవ్రతను తగ్గించాలని కోరుతూ గ్రామస్తులు రాస్తారోకోకు దిగారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ హుటాహుటిన చిన్న గుడిపాడుకు చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో చర్చించారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాహనాల రాకపోకలను అడ్డుకోవడం సరైన చర్య కాదన్నారు. సమస్య ఉన్నప్పుడు తహసీల్దార్ దృష్టికో, లేదంటే ఉన్నతాధికారుల దృష్టికో తీసుకు రావాలన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, ఆందోళన విరమించాలని కోరడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. దీంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాల రాకపోకలను పోలీసులు క్రమబద్ధీకరించారు.

మోసం చేయడం బాబు నైజం

- చంద్రబాబు మాయ మాటలతో రాష్ట్రం దివాలా
- బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. మండలంలోని చవటపాలెం, చేకూరపాడు గ్రామాల్లో మంగళవారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మేరుగు నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు మాయమాటలు, అబద్ధపు హామీలు నమ్మి ప్రజలు నిలువునా మోసపోయారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని ఇంత వరకు సక్రమంగా అమలు చేయలేదన్నారు. ప్రతి పనికి దోచుకోవడం, దాచుకోవడం చందాన టీడీపీ నాయకులు అవినీతి కూపంలో కూరుకుపోయారన్నారు. ఏ పనిచేసుకోలేని దివ్యాంగుల పెన్షన్‌ను అన్యాయంగా తొలగిస్తూ చంద్రబాబు వారి ఉసురు పోసుకుంటున్నాడని మండిపడ్డారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం చేతకాక రోజుకో డైవర్షన్ రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. పొగాకు, మిర్చి రైతులను చంద్రబాబు చేసిన మోసం వారు జీవితంలో మరచిపోరన్నారు. బర్లీ పొగాకు కొనుగోళ్లలో పార్టీలు చూసి కొనుగోలు చేస్తున్న ఈ ప్రభుత్వ తీరును ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో జగనన్న మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించడంతో పొగాకు బోర్డు చరిత్రలో ఎన్నడూ చూడని ధరలు పలికి రైతులు ఎంతో లాభపడ్డారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రైతులంతా నష్టాల పాలై సాగుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో అర్హతే ప్రామాణికంగా ఎవరి సిఫార్సు లేకుండా పథకాలు అందించారన్నారు. చంద్రబాబు నిరంకుశ పాలనకు రాష్ట్ర ప్రజలు చరమ గీతం పాడే రోజు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పేరుతో ప్రజలంతా తిరగబడాలని పిలుపునిచ్చారు. అనంతరం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్ర నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మారెళ్ల బంగారుబాబు, మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, మేధావుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కంచర్ల సుధాకర్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలినేని కోటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు కాటూరి ఆదియ్య, కాకర్ల వెంకటేష్, మండల యూత్ అధ్యక్షుడు ఇమ్మిశెట్టి బాలకృష్ణ, మండల మహిళా అధ్యక్షురాలు పోకూరి లక్ష్మీ, పోకూరి హరిబాబు, చంద్రయ్య, గోపిరెడ్డి, చవటపాలెం గ్రామ సర్పంచ్ కాట్రగడ్డ వనజ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సంతోష్, ఈదర శ్రీకాంత్, ఎండ్లూరి సుధీర్ పాల్గొన్నారు.



చవటపాలెంలో బాబు మోసాలపై క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, నాయకులు

గ్రామ కమిటీలు ఎంపిక

చవటపాలెం గ్రామ అధ్యక్షునిగా ఆర్ జగదీష్, ఉపాధ్యక్షులుగా జిలకర ప్రేమ్‌చంద్, బక్కా రవికాంత్, ప్రధాన కార్యదర్శిగా మాణిక్యరావు, అభి, సుధాకర్‌రావు పాటు మరో 12 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

బూచేపల్లి వెంకాయమ్మకు శుభాకాంక్షలు



కేక్ కట్ చేస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. చీమకుర్తిలో నిర్వహించిన వేడుకల్లో కుమారుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వారి కుటుంబసభ్యుల సమక్షంలో కేక్ కట్ చేశారు. మాజీ మంత్రి మేరుగు నాగార్జున, పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరు రవి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న బూచేపల్లి వెంకాయమ్మను గజమాలలతో సత్కరించి శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అన్ని విధాలా అండగా ఉంటాం

- ఎస్పీ ఏఆర్ దామోదర్



చెక్కు అందజేస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: విధులు నిర్వర్తిస్తూ వివిధ కారణాలతో మృతి చెందిన వారు, రిటైర్డు పోలీస్ సిబ్బంది కుటుంబాలకు, హోంగార్డులకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. సమర్థవంతమైన పోలీసింగ్‌తో పాటు సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తామని, సమాజ రక్షణలో ప్రాణాలర్పించిన సిబ్బందిని పోలీస్ శాఖ ఎప్పటికీ మరచిపోదన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది కుటుంబాలతో స్వయంగా మాట్లాడి వారికి అందాల్సిన ప్రయోజనాలు, ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ ఫైళ్ల గురించి తెలుసుకొని వాటిని త్వరగా పూర్తి చేసేందుకు సంబంధిత డీపీఓ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కారుణ్య నియామకాలు పొందని కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకొని, వారికి త్వరితగతిన కారుణ్య నియామకం పొందేలా కృషి చేస్తామని తెలిపారు. పోలీస్ కుటుంబసభ్యులకు ఏ సమస్య వచ్చినా తనను నేరుగా కలవవచ్చన్నారు. విధులు నిర్వర్తిస్తూ మరణించిన మురళి సతీమణి సుధారాణికి ఇన్సిడెంటల్ చార్జెస్ కింద రూ. 25,000 చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సీతారామిరెడ్డి, విజయ్‌కుమార్, డీపీఓ సూపరింటెండెంట్‌లు సంధానిబాష, డి.శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

29న తెలుగు భాషా దినోత్సవం

ఒంగోలు మెట్రో: ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య సంస్థ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయంలో శుక్రవారం వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు 162 జయంతి, తెలుగు భాషా దినోత్సవం నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీవీ శివారెడ్డి, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, విశిష్ట అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఉపగ్రంథపాలకురాలు కాళహస్తి సంపూర్ణ, ప్రముఖ కవి నన్నపనేని రవి, మిడసల మల్లికార్జునరావు, గుంటూరు సత్యనారాయణ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని నిర్వాహకులు తెలిపారు. 10 గంటలకు తెలుగుతల్లి కవుల విగ్రహాలకు పూలాభిషేకం, సాయంత్రం 4 గంటలకు జరిగే తెలుగు భాషా దినోత్సవ సభ అనంతరం ఆహ్వాన కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగు భాషాభిమానులు పాల్గొనాలని కోరారు.

చౌటపాలెంలో తమ్ముళ్ల దౌర్జన్యం

- సాగు చేసిన జామాయిల్ మొక్కలు ట్రాక్టర్‌తో దున్నివేత
- అడ్డుకున్న బాధిత మహిళపై దుర్భాషలాడి దాడికి యత్నం
- నాలుగు ఎకరాల్లో సాగుచేసిన జామాయిల్ మొక్కలు ధ్వంసం

పొన్నలూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రశాంతమైన గ్రామాల్లో అల్లరులు, గొడవలు, ఆస్తులను నష్టపరుస్తూ రాక్షస సంప్రదాయాన్ని సృష్టిస్తున్నారు. తమను అడిగేవారు, అడ్డుకునే వారు లేరంటూ రోజు రోజుకు మరింతగా రెచ్చిపోతున్నారు. రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతూ అధికార మదంతో లక్షల రూపాయిలు పెట్టుబడులతో సాగుచేసి పంటలను సైతం ట్రాక్టర్‌తో దున్నించి పచ్చని పంటలను ధ్వంసం చేస్తున్నారు. మండలంలోని చౌటపాలెంలో వైఎస్ సీపీ సానుభూతిపరురాలు బోయపాటి జోత్స్నకు తండ్రి నుంచి సంక్రమించిన పొలం ఉంది. చౌటపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 75/1లో 1.75 ఎకరాలు, 77/3లో 1.60 ఎకరాల భూమి ఉంది. అలాగే అనుమోలు చిన్నమ్మాయికి సర్వే నంబర్ 1426/1, 1426/2లో 2.87 ఎకరాల పొలం ఉంది. రెవెన్యూ రికార్డులతో పాటు ఆన్‌లైన్‌లో కూడా వీరి పేరుతోనే పొలం ఉంది. దీంతో కొన్నేళ్లగా ఆ పొలంలో అనేక పంటలు సాగు చేస్తూ వస్తున్నారు. నెల రోజుల క్రితం జామాయిల్ మొక్కలు సాగు చేశారు. అయితే గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు నడిపినేని నరసింహం, అతని కొడుకు కిరణ్ అధికారం ఉందని జోత్స్న, చిన్నమ్మాయికి చెందిన భూమిలోని జామాయిల్ మొక్కలను ట్రాక్టర్‌తో దున్నేశారు. సదరు వ్యక్తులు కొన్ని రోజులుగా జోత్స్నకి చెందిన భూమిని కాజేయాలన్ని రాజకీయ అండదండలతో ఆమెను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం ట్రాక్టర్ తీసుకెళ్లి సాగుచేసిన జామాయిల్ మొక్కలను దున్నేశారు.

ఏడాదిగా బాధితురాలికి వేధింపులు..

కూటమి ప్రభుత్వం ఏర్పండిది మొదలు సదరు వ్యక్తులు పొలం విషయంలో జోత్స్నని వేధిస్తున్నారు. వాస్తవంగా జోత్స్న తండ్రి రామారావు, నడిపినేని నరసింహం అన్నదమ్ములు. అయితే భాగపంపకాల్లో భాగంగా రామారావు మరణం తరువాత అతనికి చెందిన భూమి, కుమార్తె అయిన జోత్స్నకి సంక్రమించిది. దీంతో కొన్ని రోజులుగా ఆ భూమిని ఎలాగైనా పొందాలని, ఈ భూమి తమదంటూ నరసింహం అతని కుటుంబ సభ్యులు తరచూ గొడవలకు దిగుతున్నారు. ఈ క్రమంలో తన దగ్గర ఉన్న ఆధారాలతో ఆమె కందుకూరు సివిల్ కోర్టును ఆశ్రయించింది. 2018లో కోర్టు సదరు భూమి జోత్స్నకి చెందిదేనని తీర్పు ఇచ్చింది. అప్పటి నుంచి ఆ భూమిలో వివిధ పంటలు సాగు చేస్తూ వస్తోంది. అయితే ఏడాది వరకు స్తబ్దుగా ఉన్న నరసింహం, కిరణ్ ఏడాది క్రితం కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఇదే అదునుగా భావించి మంత్రి స్వామిని, అధికారులను అడ్డుపెట్టుకోని జోత్స్న భూమిని కాజేయాలని ప్రయత్నం చేశారు. అయితే ఎన్ని ప్రయత్నాలు చేసినా కుదరకపోవడంతో మంగళవారం ట్రాక్టర్ తీసుకెళ్లి జోత్స్న సాగు చేసిన జామాయిల్ మొక్కలను దున్నేశారు. ఇదేం దని అడిగిన సదరు మహిళను నీ దిక్కున చోట చెప్పుకో అంటూ దుర్భాషలాడి దాడికి యత్నించినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.



చౌటపాలెంలో ట్రాక్టర్‌తో జామాయిల్ మొక్కలను దున్నేసిన దృశ్యం

అక్రమంగా తీసుకోవాలని చూస్తున్నారు: బోయపాటి జోత్స్న



నా తండ్రి నుంచి సంక్రమించిన పొలాన్ని అధికారాన్ని అడ్డుపెట్టుకోని అక్రమంగా తీసుకోవాలని చూస్తున్నారు. పొలానికి సంబంధించిన అన్ని రకాల అర్హత పత్రాలు ఉన్నాయి. మహిళను కావడంతో ఏం చేయలేనని ట్రాక్టర్‌తో జామాయిల్ మొక్కలను దున్నేసి నష్టం చేశారు. అడ్డుకున్న నన్ను దుర్భాషలాడి, దాడి చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. పోలీసులు, ఉన్నతాధికారులు నాకు న్యాయం చేయాలి.